



కలెక్టర్ కార్యాలయం



అభివందనాలతో..

రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తి అయిన సందర్భంగా శుక్రవారం అవనిగడ్డ పంచాయతీ కార్యాలయంలో 'ఇది మంచి ప్రభుత్వం' గ్రామసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పంచాయతీ కార్యాలయం ఆవరణలో మొక్క నాటారు. - అవనిగడ్డ

బదిలీల్లో గందరగోళం

జిల్లాలోని వివిధ విభాగాల్లో ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధమైంది. బదిలీల జాబితాల తయారీలో ఏం జరుగుతుందనే అంశంపై ఉద్యోగుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. శాసనసభ్యులు, మంత్రుల ద్వారా సిఫార్సు లేఖలు తెచ్చుకుని ఉద్యోగులు బదిలీల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఆయా విభాగాల్లో వివిధ కారణాలతో జాబితాల్లో మార్పులు, చేర్పులు చేస్తుండటంతో ఉద్యోగులు తాము కోరుకున్న ప్రాంతాలకు బదిలీ అవుతామా లేదా అని గందరగోళానికి గురవుతున్నారు.

కలెక్టరేట్ చుట్టూ ఉద్యోగుల పడిగాపులు

- రాత్రిపూట తెరవెనుక మంతనాలు
- రేపటితో బదిలీల ప్రక్రియకు గడువు ముగింపు
- తొలి విడతగా తయారుచేసిన జాబితాల్లో మార్పులు
- రెవెన్యూ విభాగం బదిలీల్లో మరింత సంక్లిష్టత

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఉద్యోగుల బదిలీలకు శాసనసభ్యుల సిఫార్సు లేఖలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ తొలి విడతగా జాబితాలను తయారుచేశారు. గత నెలాఖరు నాటికి ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తిచేయాల్సి ఉంది. భారీవర్షాలు, వరదల కారణంగా ఉద్యోగులంతా వరద ప్రభావిత ప్రాంతాల్లో విధుల్లో ఉండటంతో బదిలీలను వాయిదా వేశారు. 22వ తేదీ నాటికి బదిలీల ప్రక్రియకు తుది గడువుగా ప్రకటించారు. ఉద్యోగుల బదిలీల ప్రక్రియకు బ్రేక్ పడటంతో తొలి విడతగా తయారుచేసిన జాబితాల్లో మార్పులు, చేర్పులు జరుగుతున్నాయి. ఈ అంశం బయటకు రావడంతో కూటమికి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులతో మాట్లాడుకుని శాసనసభ్యుల నుంచి సిఫార్సు లేఖలు తెచ్చుకుని బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగుల్లో గందరగోళం నెలకొంది. ఆయా విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు బదిలీల జాబితాల్లో పనిగట్టుకుని కొందరు అధికారులు మార్పులు చేస్తుండటంతో తెరవెనుక ఏం జరుగుతుందోననే భయం ఉద్యోగులను వెంటాడుతోంది. దీంతో రెండు, మూడు రోజులుగా వివిధ శాఖల ఉద్యోగులు జిల్లాస్థాయి అధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

వివాదాస్పద అధికారులను సాగనంపాలని మంత్రికి ఫిర్యాదు

కలెక్టరేట్‌లో కీలకమైన విభాగాల్లో డిప్యూటేషన్‌పై పనిచేస్తూ అత్యంత వివాదాస్పదులుగా ఉన్న ఒకరిద్దరు డిప్యూటీ తహసీల్దార్ కేడర్ ఉద్యోగులను వేరే ప్రాంతానికి బదిలీ చేయాలని కూటమి నాయకులు ఇటీవల మచిలీపట్నంలోని మంత్రి కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుతోపాటు ఈ ఉద్యోగుల పనితీరును నాయకులు మంత్రికి వివరించారు. ఈ అంశంపై విచారణ కూడా జరుగుతోంది. రెవెన్యూ ఉద్యోగుల బదిలీల జాబితాల తయారీలో కలెక్టరేట్‌లో పనిచేసే నలుగురు ఉద్యోగులు చక్రం తిప్పుతున్నారు. ఈ నలుగురిలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు ఉద్యోగులు ఉన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రెవెన్యూ ఉద్యోగుల బదిలీల జాబితాల తయారీలో వీరు కీలకపాత్ర పోషిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. వీరు తయారుచేసే జాబితాల్లో ఎన్ని చిత్రవిచిత్రాలు చోటు చేసుకుంటాయోనని రెవెన్యూ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు.

పంచాయతీరాజ్ విభాగంలో..

పంచాయతీరాజ్ విభాగంలో బదిలీల కోసం గ్రేడ్ 1, 2 కేడర్ పంచాయతీ కార్యదర్శులు 30 మంది, 5, 6 గ్రేడ్ కార్యదర్శులు 190 మంది, జూనియర్ అసిస్టెంట్లు 40 మంది, సీనియర్ అసిస్టెంట్లు 13 మంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఇద్దరు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అంతర్ జిల్లాల బదిలీల కోసం కొందరు ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా, వాటిని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయానికి డీపీవో కార్యాలయ అధికారులు పంపారు. అక్కడి నుంచి జాబితాలు వచ్చిన తరువాతే పంచాయతీరాజ్ విభాగంలో బదిలీలకు అన్ని జాబితాలను కలెక్టర్ అనుమతికోసం పంపుతామని అధికారులు చెబుతున్నారు. పంచాయతీరాజ్ విభాగంలో కొందరు శాసనసభ్యుల నుంచి ఒకే ప్రాంతంలో ఇద్దరు ఉద్యోగులను నియమించాలని సిఫార్సు చేస్తూ లేఖలు వచ్చాయి. దీంతో ఎవరిని ఎక్కడ నియమించాలనే అంశంపైనా అధికారులు తర్జనభర్జన పడుతున్నారు.

రెవెన్యూ విభాగంలో మరింత అస్పష్టత

రెవెన్యూ విభాగంలో వీఆర్వో స్థాయి నుంచి డెప్యూటీ తహసీల్దార్ స్థాయి వరకు ఉద్యోగుల బదిలీలు జరగాల్సి ఉంది. కొందరు ఉద్యోగులు శాసనసభ్యుల నుంచి సిఫార్సు లేఖలు తెచ్చుకున్నారు. అయితే కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగులు మీరు బదిలీ కోసం కోరుకున్న ప్రాంతంలో ఖాళీలు లేవని చెబుతున్నారు. దీంతో ఉద్యోగులు గత రెండు, మూడు రోజులుగా సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కలెక్టరేట్‌కు వచ్చి అధికారులతో, రెవెన్యూ అసోషియేషన్ నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నారు. తొలివిడతగా వీఆర్వోల నుంచి డిప్యూటీ తహసీల్దార్‌ల వరకు బదిలీల జాబితాలను తయారుచేయగా, ఈ జాబితాల్లో మార్పులు చేస్తున్నారు. తొలివిడతగా తయారుచేసిన జాబితాల ప్రకారమే బదిలీలు ఉంటాయని అంతా ఆశించారు. అయితే ఈ జాబితాల్లో మార్పులు చేయాలంటూ జిల్లాస్థాయి నాయకుడి పీఏ నుంచి ఒత్తిడి అధికమైంది. సదరు పీఏ తాను తయారుచేసిన జాబితాల ఆధారంగా ఉద్యోగుల బదిలీల జాబితాల్లో మార్పులు చేయాలని చెబుతున్నారు. దీంతో రెవెన్యూ ఉద్యోగులు కలవరపాటుకు గురవుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి రెవెన్యూ విభాగంలో పనిచేసే అధికారులు, ఉద్యోగులు, కూటమి నాయకులు సహా కలెక్టరేట్‌కు వచ్చి బదిలీల జాబితాల్లో జరుగుతున్న మార్పులపై ఆరా తీస్తున్నారు. తెరవెనుక ఏదో జరుగుతోందని, దీంతోనే జాబితాల్లో మార్పులు చేస్తున్నారని రెవెన్యూ ఉద్యోగులు బాహాటంగానే చెప్పుకుంటున్నారు.

ఉన్నది ఒక్కటే బోటు

- నీటిలో ఉన్న మూడో బోటు
- బ్యారేజీ వద్ద కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్



బ్యారేజీ వద్ద కొనసాగుతున్న రెస్క్యూ

విజయవాడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం బ్యారేజీ వెనుక ఇరుక్కుపోయిన బోట్లను తీసే రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. ఇప్పటివరకు రెండు బోట్లను పున్నమిఘాట్ వద్దకు చేర్చారు. మరో బోటు ఇంకా నీటిలోనే ఉంది. దీన్ని శుక్రవారం బయటకు తీస్తారని భావించినప్పటికీ సాధ్యపడలేదు. ఈ బోటుకు సీ లయన్ కంపెనీ డైవర్లు రంధ్రాలు చేస్తున్నారు. శనివారం కావడి బోట్లను తీసుకొచ్చి ముందుగా తొలగించిన రెండు బోట్ల మాదిరిగానే ఈ బోటును తొలగిస్తామని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ప్రకాశం బ్యారేజీకి ఈనెల ఒకటో తేదీన 11.47 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. ఆ సమయంలో మూడు బోట్లు ఒకసారి, రెండు బోట్లు ఒకసారి గొల్లపూడి వైపు నుంచి కొట్టుకుని వచ్చి బ్యారేజీ కౌంటర్ వెయిట్లను ఢీకొట్టిన విషయం తెలిసిందే. వాటిలో ఒక బోటు కొట్టుకుపోవడం జలవనరుల శాఖ సిబ్బంది గుర్తించారు. మూడు బోట్లు మాత్రం బ్యారేజీ వెనుక ఇరుక్కుపోయాయి. వాటిలో రెండు బోట్లను బెకమ్, సీ లయన్, కాకినాడ అబ్బులు టీం సంయుక్తంగా తొలగించింది. గేట్ల వెనుక నీటిలో మరో బోటు మునిగి ఉన్నట్టు డైవర్లు గుర్తించారు. నీటిలో అడుగు భాగాన ఒక బోటు మాత్రమే ఉందని నిర్ధారించారు. దీనితో నాలుగు బోట్లు మాత్రమే లెక్కకు వచ్చాయి. ఐదో బోటూ వరద ఉధృతికి కొట్టుకుపోయిందని జలవనరుల శాఖ అధికారులు భావించారు. ఈ బోటు కొట్టుకుపోయిన వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. దీంతో రెండు బోట్లు కిందికి కొట్టుకుపోయి, మూడు బ్యారేజీ వెనుక ఉండిపోయాయన్న నిర్ధారణకు అధికారులు వచ్చారు.

గేట్ల పరిశీలన

ప్రకాశం బ్యారేజీ వద్ద రెండు బోట్లను తొలగించడంతో అధికారులు శుక్రవారం గేట్లను పరిశీలించారు. స్లూయిజ్ గేట్ల తర్వాత నుంచి ఉన్న ఐదు గేట్లను పరిశీలించి, వాటి పనితీరును గమనించారు. ఈ బోట్ల వల్ల గేట్లకు ఏమైనా నష్టం జరిగిందా అన్న విషయాన్ని పరిశీలించారు. ఐదు గేట్లను పైకి లేపడం, కిందికి దించడం చేశారు. గేట్లన్నీ ఎప్పటిలాగే పనిచేశాయి. దీంతో జలవనరుల శాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

వరద బాధిత ప్రాంతాలకు రుణాలు



ఫెసిలిటేషన్ సెంటర్‌లో దరఖాస్తుల స్వీకరణ



విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫెసిలిటేషన్ సెంటర్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఆర్థికంగా చేదోడు అందించటానికి బ్యాంకుల ద్వారా రుణాలు అందించే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఫ్లడ్ ఎన్యూమరేషన్ జరిగిన కుటుంబాలకు బ్యాంకులు ఆసరాగా నిలువనున్నాయి. ఈ మేరకు బ్యాంకర్లతో జిల్లా యంత్రాంగం సమావేశమైంది. వరద బాధితులకు రుణాలు ఇవ్వటానికి బ్యాంకులు కూడా ముందుకు వచ్చాయి. ఎలాంటి హామీ లేకుండానే బ్యాంకర్లు రుణాలు ఇవ్వటానికి ముందుకు రావటం విశేషం. రుణాలు తిరిగి చెల్లించే విషయంలో ఏడాది పాటు మారటోరియం కూడా విధించటం గొప్ప విషయం. ఈ మారటోరియం అనేది వినియోగ రుణాలకు వర్తించదు. పంట రుణాలు, ఆటో రిక్షాలు, ద్విచక్ర వాహనాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, కిరాణా షాపులు, హోటళ్లు, ఇతర చిన్న పరిశ్రమలకు మాత్రమే ఏడాది పాటు మారటోరియం ఉంటుంది. వినియోగ రుణాలు తీసుకునే వరద బాధితులకు మాత్రం ఈ మారటోరియం వర్తించదు. వరద ప్రభావిత పరిధిలోని నగరంలోని 179 సచివాలయాల పరిధిలోని వారికి మాత్రమే బ్యాంకుల ద్వారా రుణాలు పొందటానికి అవకాశం ఉంది. వినియోగ రుణాలను వరద బాధిత కుటుంబాలు తీసుకోవచ్చు. తిరిగి తమ కుటుంబ జీవనం సాధారణ స్థితికి తీసుకురావటానికి వీలుగా ఈ రుణాలు కొండంత ఆసరాగా నిలుస్తాయి. సాధారణ ప్రజలు తీసుకునే రుణాలకు సంబంధించి 3 నెలల మారటోరియం అమల్లో ఉంటుంది.

దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

- గ్రౌండ్ ఫ్లోర్, మొదటి, రెండు, మూడు అంతస్తుల్లో ఉండేవారికి వినియోగ రుణాలు
- పంట రుణాల రీ షెడ్యూల్... ఏడాది మారటోరియం, ఐదేళ్లలో చెల్లింపు చాన్స్

బ్యాంకులు అందించే రుణాలు ఇలా

వరద ప్రభావిత ప్రాంతాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం బ్యాంకర్లకు అందజేసింది. వరద ప్రభావిత ప్రాంతానికి చెందినవారు రుణాల కోసం దరఖాస్తు చేసుకోగానే.. ఎలాంటి సెక్యూరిటీ లేకుండానే రుణాలు ఇస్తారు.

- వరద ప్రభావిత ప్రాంతాల సచివాలయాల పరిధిలోని ప్రజల ఇళ్లు గ్రౌండ్ ఫ్లోర్ మునిగితే రూ.50 వేల చొప్పున వినియోగ రుణం ఇస్తారు. ఫస్ట్‌ఫ్లోర్, సెకండ్ ఫ్లోర్ వాళ్లకు మాత్రం రూ.25 వేల చొప్పున వినియోగ రుణాలు ఇస్తారు. ఈ రుణాలను తిరిగి 36 నెలల్లో చెల్లించే అవకాశాన్ని కల్పించారు.
- వ్యవసాయ రుణాలకు సంబంధించి చూస్తే 12 నెలల మారటోరియంతో , 5 సంవత్సరాల్లో చెల్లింపు చేసేలా రుణాలు ఇస్తారు.
- ఆటో రిక్షాలు, ద్విచక్ర వాహనాలకు ఏడాది మారటోరియం ఉంటుంది. కిరాణా షాపులు, హోటల్స్ చిన్న పరిశ్రమలకు సంబంధించి పీఎం ముద్ర కింద రూ.10 లక్షల వరకు, పీఎం స్వనిధి కింద రూ.80 వేల వరకు, లఖ్‌పతి దీదీ కింద రూ.1,50,000 చొప్పున రుణాలు అందిస్తారు.

బ్యాంకింగ్ సేవలకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్

బ్యాంకుల ద్వారా రుణాలు పొందటానికి వీలుగా జిల్లా యంత్రాంగం తరఫున సహాయ, సహకారాలు అందించటం కోసం విజయవాడ సబ్ కలెక్టర్ కార్లాయయంలో ప్రత్యేక ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి ఈ ప్రత్యేక ఫెసిలిటేషన్ సెంటర్ అందుబాటులోకి వస్తుంది. లీడ్ బ్యాంక్‌గా వ్యవహరిస్తున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) ద్వారా ఈ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులూ లేకుండా బ్యాంకింగ్ సేవలు అందించటానికి, అక్కడికక్కడే దరఖాస్తులను పరిష్కరించేందుకు ఈ ఫెసిలిటేషన్ కేంద్రం పనిచేస్తోంది. అన్ని బ్యాంకుల ప్రతినిధులు ఈ ఫెసిలిటేషన్ సెంటర్‌లో అందుబాటులో ఉంటారు. రుణాల రీ షెడ్యూల్, వినియోగ రుణాలు, మూలధన రుణాలు వంటివి ఈ ఫెసిలిటేషన్ సెంటర్ ద్వారా వినియోగించుకోవచ్చు. ఈ ప్రత్యేక ఫెసిలిటేషన్ కేంద్రం ద్వారా జిల్లా యంత్రాంగం కూడా దరఖాస్తులను నిత్యం ఫాలోఅప్ చేస్తుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన చెప్పారు.

11 రైళ్ల రద్దు

- నాన్ ఇంటర్ లాకింగ్ పనులతో నిర్ణయం
- 39 రైళ్లకు వరంగల్ స్టేషన్ హోల్టింగ్ రద్దు


(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బెజవాడ డివిజన్ పరిధిలో కొవ్వూరు - గోదావరి - రాజమండ్రి - కడియం సెక్షన్‌లో నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా మరోమారు భారీ సంఖ్యలో రైల్వే శాఖ రైళ్లను రద్దు చేసింది. ఈనెల 30వ తేదీ వరకు 11 రైళ్లను రద్దు చేసింది.

రద్దు చేసిన రైళ్లు ఇవీ

తిరుపతి - విశాఖపట్నం (22708), విశాఖపట్నం - తిరుపతి (22707), విజయవాడ - విశాఖపట్నం (12718), విశాఖపట్నం - విజయవాడ (12717), విశాఖపట్నం - గుంటూరు (22701), గుంటూరు - విశాఖపట్నం(22702), గుంటూరు - విశాఖపట్నం (17239), విశాఖపట్నం - గుంటూరు (17240), విజయవాడ - రాజమండ్రి (07768), రాజమండ్రి - విశాఖపట్నం (07466), విశాఖపట్నం - రాజమండ్రి (07467)

వరంగల్ స్టేషన్‌లో హోల్టింగ్ రద్దు

విజయవాడ - కాజీపేట, బల్లార్ష సెక్షన్‌లో హసన్‌పర్తి - కాజీపేట ఎఫ్ క్యాబిన్ - వరంగల్ స్టేషన్ల మధ్య నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్న దృష్ట్యా మొత్తం 39 రైళ్లకు వరంగల్ స్టేషన్‌లో హోల్టింగ్ నిలుపుదల చేశారు. వీటిలో విజయవాడ - సికింద్రాబాద్ మధ్య నడిచే గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, షాలిమార్ ఎక్స్‌ప్రెస్, కోకనాడ ఎక్స్‌ప్రెస్, వందేభారత్ ఎక్స్‌ప్రెస్, సింహపురి ఎక్స్‌ప్రెస్, గోదావరి ఎక్స్‌ప్రెస్, గౌతమి ఎక్స్‌ప్రెస్, బీదర్ ఎక్స్‌ప్రెస్, చార్మినార్ ఎక్స్‌ప్రెస్, పద్మావతి క్స్‌ప్రెస్, ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, షిర్డీ ఎక్స్‌ప్రెస్‌లకు వరంగల్ స్టేషన్‌ను మినహాయించారు.



6లో..

మాజీ ఎమ్మెల్యే అడుసుమిల్లి కన్నుమూత

ప్రముఖుల నివాళి

నేటి నుంచి వైద్యుల విధుల బహిష్కరణ

6లో..

రెట్టించినారు!

వరినారు ధర పెంచి అమ్మకాలు

మంగళాపురం, మాజేరులో మళ్లీ వరినాట్లు

చల్లపల్లి : కృష్ణానదికి వరదలు సంభవించి నదీతీర గ్రామాల్లో మెట్ట రైతులు తీవ్రంగా నష్టపోతే, అకాల వర్షాలకు మాగాణి రైతులు నట్టేట మునిగారు. డ్రైనేజీల్లో నీరు ఎగదట్టి ఎక్కడికక్కడే నిలిచిపోవటంతో మాజేరు, మంగళాపురం గ్రామాల్లో పంటచేలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పైరును తొలగించి మళ్లీ నాట్లు వేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. దీన్ని ఆసరా చేసుకుని నారు రేట్లు భారీగా పెంచేశారు. వందశాతం ధర పెంచి విక్రయిస్తున్నారు.

ఏడు గ్రామాల్లో దెబ్బతిన్న వరి

చల్లపల్లి మండలంలో ప్రధానంగా మంగళాపురం, మాజేరు గ్రామాల్లో వరి పైరు దెబ్బతినగా, పాగోలు, లక్ష్మీపురంలో స్వల్పంగా నష్టం జరిగింది. మొత్తంగా ఏడు గ్రామాల్లో వరి పంట నష్టపోయినట్టు అధికారులు నిర్ధారించారు. మంగళాపురంలో 900 ఎకరాలకుపైగా, మాజేరులో సుమారు 400 ఎకరాలు, లక్ష్మీపురం.. పాగోలులో 200 ఎకరాల్లో పంట నష్టం జరిగింది.

సెంటు నారు మూడు వేల వరకు కొనుగోలు

వరి నారుకు పెరిగిన డిమాండ్

వరి నాట్లు మళ్లీ చేపట్టడంతో నారుకు డిమాండ్ పెరిగింది. ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా ధర పలుకుతోంది. సెంటు నారు రూ.1500 నుంచి రూ.3000 వరకు ధర పలుకుతోంది. గతంలో నారు తీసుకెళ్లేవారు లేక ఊరికే తీసుకుపొమ్మనే వారనీ, వర్షాలతో పంటలు దెబ్బతినటంతో నారుకు డిమాండ్ పెరిగిందని రైతులు చెబుతున్నారు. ఆలస్యంగా మడులు పోసినవారు నారును అధిక ధరకు విక్రయిస్తున్నారు. మంగళాపురం రైతులు కోన, ఇతర గ్రామాల నుంచీ నారును తీసుకువస్తున్నారు. కొద్దిమంది రైతులు మాత్రం ఈ ఇబ్బందులు పడలేక పొలంలోనే నారుమడి పోసుకున్నారు.

చేను వదల్లేక మళ్లీ వరినాట్లు

వర్షాలకు వరి చేలు పూర్తిగా దెబ్బతినగా, చేలను వదల్లేక మళ్లీ వరినాట్లు వేసుకుంటున్నామని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే నెల రోజుల సమయం పూర్తయ్యిందనీ, వర్షాలతో పైరు దెబ్బతిని ప్రస్తుతం నాట్లు వేస్తుండటంతో పంట ఆలస్యంగా చేతికి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఖరీఫ్ సాగు చేపట్టినపుడు వరినాట్లకు అయిన ఖర్చుకంటే ఇప్పుడు అదనంగా ఖర్చవుతోందనీ, ఎకరం పొలానికి నారు కొనుగోలుకే రూ.10 వేల నుంచి రూ.12వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందనీ, కూలీల ఖర్చు అదనమని చెబుతున్నారు. గతంలో ఎకరాకు రూ.10వేల వరకూ పెట్టిన పెట్టుబడి పూర్తిగా నష్టపోయామని అన్నారు. ఇన్ని వ్యయప్రయాసలకోర్చి మళ్లీ నాట్లువేసి వ్యవసాయం చేస్తున్నా ఫలితం ఎలా ఉంటుందోనన్న మీమాంస వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు మాత్రం ముంపునకు గురైన పొలాలను వదిలేశారు. ఎక్కువరోజులు నీటిలో ఉండిపోయి వరిపైరు పూర్తిగా ఎండిపోగా, ఆ పొలాల్లో మళ్లీ నాట్లు వేసేందుకు రైతులు ఇష్టపడటం లేదు.



చల్లపల్లి మండలం మాజేరులో వరినాట్లు వేస్తున్న కూలీలు

ప్రభుత్వం ఆదుకోవాలి

మూడు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. వర్షాలకు పైరు పూర్తిగా దెబ్బతిన్నది. చేను ఖాళీగా వదల్లేక మళ్లీ నాట్లు వేస్తున్నాం. గ్రామంలో నారు ఎక్కడా లేకపోవటంతో కోన గ్రామం నుంచి నారు కొనుగోలు చేసి తీసుకొచ్చాం. ప్రస్తుతం నారుకు మంచి డిమాండ్ ఉంది. గతంలో పెట్టిన పెట్టుబడి పూర్తిగా నష్టపోగా, ఇప్పుడు వేసే నాట్లకు రెట్టింపు ఖర్చు అవుతోంది. అధికారులు దెబ్బతిన్న పొలాల వివరాలు రాసుకుని వెళ్లారు. ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందనే ఆశతో ఉన్నాం.

- నెరుసు రామకృష్ణ, కౌలు రైతు, మంగళాపురం



డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

సమస్యలు పరిష్కరించాలి

» నేటి నుంచి వైద్యుల విధుల బహిష్కరణ

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 20 : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు శనివారం నుంచి విధులకు గైర్హాజరు కానున్నట్టు సంఘ నాయకులు డాక్టర్ అరుణ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో 85ను వ్యతిరేకిస్తూ శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద సంఘ నాయకులు, వైద్యులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం దిగి వచ్చేంత వరకు ఆందోళన చేపడతామన్నారు. నీట్ పీజీ కౌన్సెలింగ్‌లో గతంలో ఇచ్చిన విధంగా 30 మార్కులు రాయితీ ఇవ్వాలన్నారు. జీవో 85లో 30 నుంచి 15 శాతంకు తగ్గించడం దురదృష్టకరమన్నారు. ఆరేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న వారిని డిప్యూటీ సివిల్ సర్జన్‌గా, 12 ఏళ్లు పూర్తి చేసుకున్న వారిని సివిల్ సర్జన్‌గా పదోన్నతి కల్పించాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నుంచి విధులకు గైర్హాజరవుతామని పేర్కొన్నారు. ప్రభుత్వం చర్చలకు రాని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, వైద్యులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే అడుసుమిల్లికి ప్రముఖుల నివాళి



వన్‌టౌన్ : వర్తమాన రాజకీయ విశ్లేషకునిగా జయప్రకాష్ తనదైన పాత్ర పోషించిన అడుసుమిల్లి జయప్రకాశ్‌కు పలువురు నివాళులు అర్పిస్తూ ప్రస్తుతించారు. మాజీ ముఖ్యమంత్రి నాదేండ్ల భాస్కర రావు హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో జయప్రకాష్ మృతదేహాన్ని దర్శించి నివాళులర్పించారు. రాజ్యసభ మాజీ సభ్యులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ విలువలు కలిగిన నాయకుడిని కోల్పోయామని పేర్కొన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం జయప్రకాష్ పనిచేశారన్నారు. కేవీపీ రామచంద్రరావు పంపిన సంతాప సందేశంలో రాజకీయాలకు అతీతంగా విజయవాడ ప్రజలకు జయప్రకాష్ సేవలు అందించటంలో ముందున్నారని తెలిపారు. విజయవాడ తూర్పు మాజీ ఎమ్మెల్యే యలమంచిలి రవి విజయవాడ ప్రత్యక్ష రాజకీయాల్లో జయప్రకాష్‌ది క్రియాశీలక పాత్ర అని పేర్కొన్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు సంతాపం తెలియజేస్తూ అడుసుమిల్లి జయప్రకాష్‌తో తనకున్న పరిచయాలను నెమరువేసుకున్నారు. చిరంజీవి తిరుమలేష్‌కు, కుటుంబసభ్యులకు ఆయన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. జయప్రకాష్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

ల్యాండ్‌పూలింగ్ స్కీంకు చిన్న సవరణ

అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి రాజధాని నిర్మాణానికి భూముల కోసం ల్యాండ్‌పూలింగ్ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. ఆ చట్టం ప్రకారం భూములిచ్చిన రైతులకు ప్లాట్‌ల కేటాయింపులో లాటరీ విధానం అవలంబించారు. అయితే ఇప్పుడు సీఆర్‌డీఏ ల్యాండ్ పూలింగ్ స్కీం రూల్స్ 2015 చట్టానికి చిన్నపాటి సవరణ తెస్తూ మున్సిపల్‌శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ చట్ట సవరణ ద్వారా ఇక నుంచి ల్యాండ్ పూలింగ్ స్కీం ద్వారా భూములిచ్చే రైతులకు కేటాయించే ప్లాట్‌లను గతంలో మాదిరిగా లాటరీ మాదిరిగా గానీ, ఏదైనా పారదర్శక విధానంలో గానీ సీఆర్‌డీఏ కమిషనర్ నిర్ణయం మేరకు కేటాయించవచ్చని ల్యాండ్ పూలింగ్ చట్టంలోని షెడ్యూల్-2(1)(సి)ను సవరించారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

» జగన్, వైసీపీ నేతల కమీషన్ల కక్కుర్తి

» హిందువుల మనోభావాలతో చెలగాటం

» తిరుమలలో కల్తీ నెయ్యి వాడకంపై బ్రాహ్మణ సాధికార సమితి ఆగ్రహం



తిరుమల ఘటన బాధ్యులను శిక్షించాలని ధర్నా చేస్తున్న బ్రాహ్మణ సాధికార సమితి సభ్యులు

వన్‌టౌన్, సెప్టెంబరు 20 : జగన్, వైవీ సుబ్బారెడ్డి శ్రీవారి భక్తులకు క్షమాపణ చెప్పాలని ఎన్టీఆర్ జిల్లా బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ కె.శివశర్మ డిమాండ్ చేశారు. గురునానక్‌నగర్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తిరుమలలో లడ్డూల తయారీకి వినియోగించిన నెయ్యి కల్తీ చేయడం దారుణమన్నారు. ఇందుకు సబంధించిన దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. జగన్, వైసీపీ నాయకులు కమీషన్ల కోసం కక్కుర్తిపడ్డారని, అన్నదానాన్ని కూడా భ్రష్టుపట్టించారని, తిరుమలలో ఆధ్యాత్మికత లోపించిందని విమర్శించారు. వైసీపీ నాయకులకు దేవుడు అంటే భయం లేదని, భక్తులు అంటే గౌరవం లేదని, హిందువుల మనోభావాలతో చెలగాటమాడారని విమర్శించారు. కల్తీ నెయ్యి వాడకాన్ని ప్రోత్సహించిన దుర్మార్గులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని తెలిపారు. లడ్డూను అపవిత్రం చేయటం దుర్మార్గమైన చర్యని పేర్కొన్నారు. అన్నదానంలో కూడా నాసిరకమైన వస్తువులు వాడారని విమర్శించారు. తిరుమలలో జగన్ పాలన సమయంలో ఎన్నో అపవిత్ర పనులు జరిగాయని ఆరోపించారు. టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చేసిన తప్పులు కప్పిపుచ్చుకునేందుకు చంద్రబాబును విమర్శించటం విడ్డూరంగా ఉందన్నారు. వైవీ సుబ్బారెడ్డి క్షమార్హుడు కాదన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ అంటూ కొత్త డ్రామాలాడుతున్నారని పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ కూడా ప్రమాణం చేస్తానని ప్రకటించటంతో వైవీ సుబ్బారెడ్డి తోకముడిచారని విమర్శించారు. తిరుమలను అపవిత్రం చేసిన ఎమ్మెల్యే జగన్, వైవీ సుబ్బారెడ్డి ఇద్దరూ శ్రీవారి భక్తులకు క్షమాపణలు చెప్పాలని, లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని, దేవుడు కూడా త్వరలో శిక్షిస్తాడని చెప్పారు. తిరుమలకు జగన్ రెడ్డి తన భార్యతో వెళ్లిన సందర్భం లేదని గుర్తుచేశారు. తన ఇంటిలో ఉత్సవాలకు తిరుమల సెట్టింగ్‌లు వేయించుకుని స్వామివారి ప్రతిష్ఠను దిగజార్చారని చెప్పారు. టీడీపీ పశ్చిమ నియోజకవర్గ నాయకులు నక్కా కృష్ణ, నెల్లూరు నాని, రెంటపల్లి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

జగన్ దిష్టిబొమ్మ దహనం

తిరుపతి లడ్డూ విషయంలో హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన దుర్మార్గుడు జగన్ మోహన్ రెడ్డి అంటూ అతడి దిష్టిబొమ్మను జనసేన నాయకురాలు తిరుపతి అనూష ఆధ్వర్యంలో శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జగన్ మోహన్ రెడ్డి, ఆయన అనుచరులను దేవదాయశాఖ మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావును అరెస్టు చేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యిని వాడటం ఎంతో దుర్మార్గమని, వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జగన్ మోహన్ రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి ఏమి మాట్లాడుతున్నాడో అతనికే అర్థమవుతుందా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మంతాపురం రాజేష్, కూరాకుల సురేష్, దాసి రామ్మోహన్, కానాల వినోద్‌కుమార్, ఎండీ అయాజ్, షేక్ బక్ష, ప్రవీణ్, మూర్తిరాజు, ఎస్‌కె.అలీ, దాసరి బుజ్జి, ఆదిత్య రెడ్డి, ఆచంటి రాజశేఖర్, మణికంఠ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోండి

» ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ : పరమ పవిత్రమైన తిరుమలలో ఘోర అపచారానికి పాల్పడిన నీచులు ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రజావేదికలో విలేకర్లతో మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం కమీషన్‌ల కోసమే లడ్డూ నాణ్యతను తగ్గించారని ఆరోపించారు. భక్తుల మనోభావాలను దెబ్బతీశారని, అవకతవకలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణలో మరిన్ని విషయాలు బయటపడతాయన్నారు. తిరుమల పవిత్రతను కాపాడేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పాలనకు 100 రోజులు

» లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాల అమలు

» ఇంటింటికీ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



రామలింగేశ్వర నగర్‌లో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న కలెక్టర్ సృజన

వన్‌టౌన్, సెప్టెంబరు 20 : ప్రజల ఆకాంక్షల మేరకు సుపరిపాలన అందిస్తూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్న మంచి ప్రభుత్వం మనముందు ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన పూర్తిచేసిన సందర్భంగా శుక్రవారం రామలింగేశ్వరనగర్‌లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వృద్ధాప్య పెన్షన్‌లు రూ4వేలు, దివ్యాంగులకు రూ.6వేలకు పెంచారని, ఆకలితో ఉన్న నిరుపేదలకు అన్నా క్యాంటీన్లను పునఃప్రారంభించి రూ.5లకే భోజనం పెట్టి ఆదుకుంటున్న ప్రభుత్వం ఇది అన్నారు. ధాన్యం కొనుగోలు బకాయిలను రూ.1,674 కోట్లు చెల్లించి రైతులను ఆదుకున్నారు. సొంత భూమి పరులపాలవుతుందన్న భయాన్ని పోగొట్టారని, మెగా డీఎస్సీ ప్రకటన సాహసోపేత నిర్ణయమన్నారు. బుడమేరు ముంపు ప్రాంతాలను హుటాహుటిన క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను గమనించి చంద్రబాబు బాధితులకు అండగా నిలిచారని చెప్పారు. రాత్రి, పగలు నిద్రాహారాలు మాని, ఉన్నతాధికారులు, మంత్రివర్గం, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులందరినీ విజయవాడకు రప్పించారన్నారు. ప్రజాప్రతినిధులతో పాటు ఐఏఎస్ అధికారులకు కూడా బాధ్యతలు అప్పగించి బాధితులకు పూర్తి సహాయ సహకారాలు అందించారన్నారు. సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం వినూత్న పథకాలను అమలు చేస్తుందని ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఈవో రామారావుకు చెక్కు అందజేస్తున్న సికింద్రాబాద్‌కు చెందిన బొర్రా నిరంజన్

దుర్గమ్మ ఆలయ స్వర్ణతాపడానికి

రూ.8లక్షల విరాళం

వన్‌టౌన్, సెప్టెంబరు 20 : దుర్గామల్లేశ్వర దేవస్థానం స్వర్ణతాపడం పనుల నిమిత్తం సికింద్రాబాద్‌కు చెందిన ఏపీఎస్ఈబీ డిపార్టుమెంట్ రిటైర్డ్ ఉద్యోగి బొర్రా నిరంజన్ శుక్రవారం దేవస్థానం ఈ.ఓ కె.ఎస్. రామారావుకు రూ.8లక్షల విరాళం చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు నిరంజన్ అతని కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం చేయించారు. వేద పండితులు వారికి ఆశీర్వచనం అందచేశారు. అనంతరం ఈ.ఓ నిరంజన్‌కు అమ్మవారి లడ్డూ ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందచేశారు. బొర్రా నిరంజన్ (86) ఇటీవల ట్రైన్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో ఆయన ఆరోగ్యం కోలుకుంటే అమ్మవారి దర్శనం చేసుకుంటానని మొక్కుకున్నారు. అమ్మవారి దయతో ఆయన ఆరోగ్యం కుదుటపడి మామూలు స్థితికి చేరుకున్నారు. శుక్రవారం ఆయన కుటుంబసభ్యులతో ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని, ఆలయ స్వర్ణతాపడం నిమిత్తం ఈ.ఓకు చెక్కును అందచేశారు. అమ్మవారి దయతో తాను మళ్లీ యధావిధిగా ఆరోగ్యంగా ఉన్నానని తెలిపారు.

ఇద్దరు డీటీలకు షోకాజ్ నోటీసులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : గన్నవరం పీడీఎస్ డీటీ పోస్టు కోసం పోటీ పడుతూ పరస్పర వ్యక్తిగత ఆరోపణలతో రచ్చకెక్కిన ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్‌లకు(పీడీఎస్ డీటీ ప్రధాన్, రెవెన్యూ డీటీ వెంకటరమణ) గుడివాడ, ఆర్డీవో పద్మావతి గురువారం సాయంత్రం షోకాజ్ నోటీసులు జారీచేశారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'డీటీ కోసం పోటీ' కథనానికి స్పందించిన ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పరస్పరం అవినీతి, లైంగిక వేధింపుల ఆరోపణలతో రచ్చకెక్కడం, అనుకూల రేషన్ డీలర్లతో నిరసన కార్యక్రమాలు నిర్వహించడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులిద్దరిపై చర్యలు ఎందుకు తీసుకోకూడదో చెప్పాలంటూ నోటీసులు జారీ చేశారు. పీడీఎస్ డీటీ కోసం వ్యక్తిగత ఆరోపణలతో శాఖ ప్రతిష్ఠను దిగజార్చడంపై రెవెన్యూ ఉద్యోగులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

వైసీపీకి కౌన్సిలర్ల రాజీనామా

జగ్గయ్యపేట/పెనుగంచిప్రోలు : జగ్గయ్యపేట పురపాలకసంఘానికి చెందిన వైస్‌ఛైర్మన్ తుమ్మల ప్రభాకర్ సహా 12 మంది వైసీపీ కౌన్సిలర్లు పార్టీకి రాజీనామా చేసినట్టు ప్రకటించారు. పెనుగంచిప్రోలుకు చెందిన వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాదల వీరయ్య చౌదరి తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అంతా ఉదయభానుతో పాటు 22వ తేదీన జనసేన పార్టీలో చేరుతున్నట్టు తెలిపారు.

ఎన్టీఆర్ జిల్లా అటవీశాఖ ఇన్‌చార్జి అధికారిగా రాజశేఖర్‌రావు



వన్‌టౌన్ : ఎన్టీఆర్ జిల్లా అటవీశాఖ ఇన్‌చార్జి అధికారిగా గురువారం కృష్ణాజిల్లా అటవీశాఖ అధికారి కె. రాజశేఖర్‌రావు బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా అటవీశాఖ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎవిఎస్ఆర్‌కె అప్పన్న వ్యక్తిగత కారణాల వల్ల సుమారు నెల రోజుల పాటు సెలవు పై వెళ్లారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కృష్ణాజిల్లా అటవీశాఖ అధికారి రాజశేఖర్‌రావుకు ఎన్టీఆర్‌జిల్లా అటవీశాఖ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. గురువారం బాధ్యతలుతీసుకున్న ఆయన ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు.

న్యూస్ బాక్స్

ప్రశాంతంగా సివిల్స్ మెయిన్ పరీక్షలు

వన్‌టౌన్, సెప్టెంబరు 20 : విజయవాడ ఎస్ఆర్ఆర్, సీవీఆర్ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించిన యూపీఎస్సీ సివిల్స్ మెయిన్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షా కేంద్రాలను జేసీ నిధి మీనా పరిశీలించారు. శుక్రవారం నాటి పరీక్షకు 135 మంది అభ్యర్థులకుగాను 128 మంది హాజరయ్యారు.



అక్రమ తవ్వకాల ప్రాంతాలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

విజిలెన్స్ తనిఖీలు

వన్‌టౌన్ : విజయవాడ రూరల్ పరిధిలోని పాతపాడు, నైనవరం రెవెన్యూ భూముల్లో అక్రమ తవ్వకాలు జరిగిన ప్రదేశాలను శుక్రవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా విజిలెన్స్ ఏజీ సుధాకర్ బృందం సర్వే నిర్వహించారు. మొత్తం ప్రాంతాన్ని పరిశీలించారు. రెవెన్యూ అధికారి రఘుబాబు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్ : వేదవిద్యలో ఉత్తీర్ణత పొందిన నిరుద్యోగులకు దేవదాయశాఖ ఆధ్వర్యంలో నెలకు రూ.3వేలు భృతి పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు దేవదాయ శాఖ అధికారిణి కె.సుపద్మాదేవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేదవిద్యలో పై కోర్సుల్లో ఉత్తీర్ణత పొందిన వారు దరఖాస్తు చేయవచ్చునని, దరఖాస్తుతో పాటు వేదవిద్య సర్టిఫికెట్ల నకళ్లు, ఆధార్ నకలు, ఎటువంటి ఉద్యోగం చేయటం లేదని స్వీయ అఫిడవిట్‌లు జతచేయాలన్నారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం 5లోగా విజయవాడలోని కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 0866-2572004 ఫోన్‌చేసి తెలుసుకోవచ్చునని తెలిపారు.

గడువు పొడిగింపు

మచిలీపట్నం టౌన్ : ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరంలో టెన్త్, ఇంటర్ ప్రవేశం కోరే అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ఈనెల 28వరకు గడువు పొడిగించినట్టు డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. నిర్ణీత ఫీజుతో పాటు రూ. 200 అపరాధ రుసుముతో 29, 30 తేదీల్లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వివరాలకు 80084 03506కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

బ్యాంకింగ్ సేవలకు ప్రత్యేక కేంద్రం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



బ్యాంకింగ్ సేవల ప్రత్యేక ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన

వన్‌టౌన్, సెప్టెంబరు 20 : భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతులకు బ్యాంకింగ్ సేవలను అందించేందుకు ప్రత్యేకంగా విజయవాడ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో 'బ్యాంకింగ్ ఫెసిలిటేషన్ కేంద్రం' ఏర్పాటు చేశామని, బాధితులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన సూచించారు. శుక్రవారం ఆమె ఫెసిలిటేషన్ కేంద్రాన్ని రాష్ట్ర ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి జె.నివాస్, విజయవాడ ఆర్డీవో సీహెచ్ భవానీశంకర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె బ్యాంకింగ్ సేవలపై పలు సూచనలు చేశారు. దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించటంతో పాటు ఫాలోఅప్ కూడా జరుగుతుందన్నారు. యూబీఐ, ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి, ఐసీఐసీఐ ప్రతినిధులు అందుబాటులో ఉంటారన్నారు. రుణాల రీషెడ్యూల్ అవకాశాన్ని పొందటంతో పాటు వినియోగ రుణాలు, కొత్త మూలధన రుణాలు వంటి సేవలను పొందవచ్చునని తెలిపారు. లీడ్ బ్యాంక్, యుబీఐ భాగస్వామ్యంతో బ్యాంకింగ్ సేవలను సులువుగా పొందేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ ఏజీఎం డి.శ్రీనివాస్, యుబీఐ డిప్యూటీ రీజనల్ హెడ్ ఐవీఎస్ మూర్తి, ఎల్డీఎం కె.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను నమ్మించి మోసం

» కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ ఆగ్రహం



మాట్లాడుతున్న తిరుమలై రామన్

ధర్నాచౌక్, సెప్టెంబరు 20 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులను నమ్మించి మోసం చేశాయని ఏఐవైఎఫ్ జాతీయ ప్రధానకార్యదర్శి తిరుమలై రామన్ మండిపడ్డారు. 100 రోజుల పాలనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఎన్ని ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ స్థానిక రెవెన్యూ అధికారుల సంఘం కార్యాలయంలో శుక్రవారం జరిగింది. తొలుగ సంఘం పతకాన్ని రాష్ట్ర మాజీ నాయకుడు దోనేపూడి శంకర్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రారంభోత్సవ సభలో ఆర్.తిరుమలై రామన్, ఏఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, మాజీ రాష్ట్ర నాయకుడు దోనేపూడి శంకర్ మాట్లాడారు. ప్రతీ ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు అని గత పదేళ్లుగా ప్రధాని నరేంద్రమోదీ నిరుద్యోగులను మభ్యపెడుతున్నారన్నారని విమర్శించారు. ప్రతీ ఏడాది 20 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు 100 రోజుల పాలనలో నిరుద్యోగుల గురించి ఆలోచన చేయకపోవడం బాధాకరమన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మూడు నెలలు గడుస్తున్నా ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న రెండు లక్షల 30 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. 100 రోజుల పాలనలో నిరుద్యోగులకు ఏం చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి నక్కి లెనిన్‌బాబు ఉపాధ్యక్షులు ఎంవి.సుబ్బారావు, జి.నాగరాముడు, సంతోష్‌కుమార్, కత్తి రవి, ఎం.యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



షటిల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

క్రీడాకారులు స్పోర్టివ్‌గా ఉండాలి

» ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

» గన్నవరంలో ఉమ్మడి జిల్లా షటిల్ టోర్నమెంట్ ప్రారంభం

గన్నవరం, సెప్టెంబరు 20 : క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని.. ప్రతి క్రీడాకారుడు స్పోర్టివ్‌నెస్ కలిగి ఉండాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లా షటిల్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే వెంకట్రావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. గన్నవరం కేవీఆర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన సభకు అసోసియేషన్ ఛైర్మన్ కలపాల వెంకటరమణ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, ఎందరో మహానుభావులు కృష్ణా జిల్లా గడ్డపై జన్మించి జిల్లా ఖ్యాతిని ప్రపంచానికి విస్తరింపజేశారన్నారు. క్రీడాకారుల్లో స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. క్రీడలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నానని గన్నవరాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతానన్నారు. మల్లవల్లి పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చెందుతుందన్నారు. ఎన్నికల ముందు అక్కడ రూ.50లక్షలు ఎకరం ఉంటే ఇప్పుడు రూ.2కోట్లకు చేరిందన్నారు. కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కేవీఆర్ కిషోర్ మాట్లాడుతూ, 65 టీములు వచ్చాయని, క్రీడాకారులకు ఉచిత భోజన వసతి కల్పించామన్నారు. ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్‌లను సన్మానించారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు, టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీఎస్ఆర్ మూర్తి, న్యాయవాదులు గారపాటి రవికుమార్, అమర్తల సోమేశ్వరరావు, నల్లమోతు రమేష్, కెవిఎస్ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేకు విశేష స్పందన



వన్‌టౌన్ : గవర్నర్‌పేటలోని ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం జరిగిన అమరావతి రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ డేకు విశేష స్పందన వచ్చింది. ఏపీ సిఆర్‌డిఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ ఆధ్వర్యంలో జరిగిన గ్రీవెన్స్ డేలో వివిధ గ్రామాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను విన్నవించుకున్నారు. అదనపు కమిషనర్ రైతుల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో అమరావతి రైతులు, రైతు కూలీలు విచ్చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఏపీ చాంబర్ సభ్యుల వితరణ



వన్‌టౌన్ : వరద బాధిత సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ బృందం అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, మాజీ అధ్యక్షుడు ముత్తవరపు మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్‌లు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి కోటి రూపాయల విలువైన చెక్కులను అందచేశారు. ఈ బృందంలోని మరికొందరు సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు రూ.42,50,000 చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందచేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అంకితభావం, నాయకత్వానికి సహాయక చర్యలు విజయవంతంగా నడిపించినందుకు ఏపీ ఛాంబర్ సభ్యులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నాయకత్వం లక్షలాది మంది ప్రజలను వరద సహాయక చర్యల్లో పాల్గొనేలా ప్రేరేపించిందని ఏపీ ఛాంబర్ సభ్యులు పేర్కొన్నారు.

మునేరులో వ్యక్తి గల్లంతు

కంచికచర్ల రూరల్ : వేములపల్లికి చెందిన జక్కుల వెంకటేశ్వరరావు (35) స్నేహితులతో కలిసి చేపల వేటకు వెళ్లి మునేరులో శుక్రవారం సాయంత్రం గల్లంతయ్యాడు. స్నేహితులతో కలిసి మునేరు ఆవలి వైపునకు వెళుతుండగా మధ్యలో లోతుగా ఉండటంతో గల్లంతయ్యాడు. వెంకటేశ్వరరావు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వెంకటేశ్వరరావుకు భార్య, ఇద్దరు ఆడ పిల్లలున్నారు.

37 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

ఇబ్రహీంపట్నం రూరల్: మూలపాడులో అక్రమంగా నిల్వ ఉంచిన 37 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పీడీఎస్ డీటీ బత్తిన రామకృష్ణ శుక్రవారం తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్నారు. వాటిని షాపు నంబరు 49కి తరలించారు. ఆర్ఐ ఐ.గోపి తదితరులు పాల్గొన్నారు.



50 ఏళ్లనాటి అపురూప చిత్రంతో అభిమాని రేపాక వెంకటేశ్వర్లు

ఏనాటిదో.. ఈ బంధం

» అక్కినేని వీరాభిమాని

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 20 : మచిలీపట్నంకు చెందిన అక్కినేని నాగేశ్వరరావు అభిమాని, సినీ ఆపరేటర్ రేపాక వెంకటేశ్వర్లు అక్కినేని నాగేశ్వరరావు చలనచిత్ర రజతోత్సవ వేడుకల సందర్భంగా ప్రచురించిన 'ఆంధ్రజ్యోతి' కాపీని భద్రపరిచి అక్కినేని నాగేశ్వరరావు పట్ల అభిమానాన్ని చాటుకున్నారు. 1970 సెప్టెంబరు 20న రజతోత్సవం సందర్భంగా ప్రచురించిన 'ఆంధ్రజ్యోతి' పత్రికను భద్రపరిచి ఫ్రేమ్ కట్టించారు. అక్కినేని నాగేశ్వరరావు నటించిన పలు చిత్రాలను ఈయన పలుమార్లు చూసేవారు. చెన్నై నుంచి హైదరాబాద్‌కు చలనచిత్ర సీమను తీసుకువచ్చి హైదరాబాద్‌లో అన్నపూర్ణ స్టూడియోను స్థాపించి అక్కినేని నాగేశ్వరరావు తెలుగు చలనచిత్ర పరిశ్రమకు జీవం పోశారన్నారు. గుడివాడ ఏఎన్ఆర్ కళాశాల భవన నిర్మాణాలకు నిధులు అందజేశారన్నారు. గుడివాడ తాలూకాలో పుట్టిన అక్కినేని సినిమాలు సందేశాత్మకంగా ప్రేక్షకుల హృదయాలలో నిలిచిపోయాయన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	119, 128, 139
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.50

ఎన్‌సీసీ కేడెట్ల ప్రతిభ



సాధించిన సర్టిఫికెట్లతో కేడెట్లు

ఉయ్యూరు, సెప్టెంబరు 20 : సికింద్రాబాద్‌లో ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి ఆర్మీ అటాచ్‌మెంట్ ట్రెనింగ్ క్యాంపులో ఏజీ అండ్ ఎస్ జీఎస్ కళాశాల ఎన్‌సీసీ కేడెట్లు విశేష ప్రతిభ కనవరచి సర్టిఫికెట్లు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం శివనాథ్, స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ, ఎన్‌సీసీ కేర్ టేకర్ ఎండీ నూర్ విద్యార్థులను అభినందించారు.

ప్రజలకు ఇది మంచి ప్రభుత్వం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్
- పలు గ్రామాల్లో కూటమి ప్రభుత్వం నూరు రోజుల వేడుకలు
- ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరిస్తున్న పార్టీ శ్రేణులు



పెనమలూరులో కూటమి వంద రోజుల పాలనను వివరిస్తున్న బోడె ప్రసాద్



దావాజీగూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

పెనమలూరు, సెప్టెంబరు 20 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు ఇది మంచి ప్రభుత్వమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం పేరిట పెనమలూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులైన సందర్భంగా తమ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకర రావు, మారుపూడి ధనకోటేశ్వరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్, సర్పంచి లింగాల భాస్కరరావు, ఎంపీడీఓ సునితా శర్మ, తహశీల్దారు గోపాలకృష్ణ, ఏటి శివశంకర్, తోటకూర ఉదయభాస్కర్, కిలారు శ్రీనివాసరావు, షేక్ సైదులు, కిలారు వెంకట సుబ్బారావు, పాముల బలరాం, మట్టపర్తి బుజ్జి, లుక్కా అరుణ్, మణికంఠ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన: యార్లగడ్డ

గన్నవరం : చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల పాలనలో రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజల కోసం ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. మండలంలోని దావాజీగూడెం, అల్లాపురం, గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, ప్రజలకు మంచి పరిపాలన అందించటం కూటమి ప్రభుత్వానికే సాధ్యమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్‌లను రూ.4వేలు, రూ.6 వేలు ఇస్తున్నారన్నారు. ఉద్యోగులకు ఒకటవ తేదీన జీతాలు విడుదల చేస్తున్నారన్నారు. నిరుద్యోగ యువత భవిష్యత్‌పై వెలుగు సంతకం మెగా డీఎస్సీకి చేశారన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుతో ప్రజల ఆస్తుల భద్రతకు భరోసా కల్పించారన్నారు. ఘన విజయాన్ని తనకు కట్టబెట్టిన గన్నవరం ప్రజల కోసం ఐదేళ్లు కష్టపడి పని చేస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, చిరుమామిళ్ల సూర్యం, ఆళ్ల గోపా లకృష్ణ, గుజ్జర్లమూడి బాబూరావు, మూల్పూరి సాయికళ్యాణి, చిమట రవివర్మ, సర్పంచ్ బడుగు బాలమ్మ, తహసీల్దార్ శివయ్య, ఎంపీడీవో ఇ.సత్యకు మార్, పాలకేంద్రం అధ్యక్షుడు గొంది నరేంద్ర, పీఏసీఎస్ అధ్యక్షుడు గొంది శివకోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పాతాళానికి పడిపోయిన వైసీపీ..



ఈడుపుగల్లులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా

కంకిపాడు : కూటమి దెబ్బకు వైసీపీ పాతాళానికి పడిపోయిందని కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుపై చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించారు. ఈడుపుగల్లులో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా మాట్లాడుతూ వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను సగానికి పైగా నెరవేర్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పందిపాటి ఇందిర, పార్టీ అధ్యక్షులు షేక్ షకార్, పందిపాటి సుధాకర్, అనుమోలు రామకృష్ణ, సుంకర శ్రీహరి, చినబాబు, కామేశ్వరరావు, నిరంజనరావు, ఈవో అహ్మద్, పంచాయతీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కంకిపాడులో నిర్వహించిన మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో తెలుగురైతు మండల కార్యదర్శి గోగినేని వెంకటరమణ, వణుకూరు విక్రం, బొర్రా వెంకట్, కొండా నాగేశ్వరరావు, నాంచారయ్య శివపార్వతి పాల్గొన్నారు. ఉప్పలూరులో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య, చలసాని రాధాకృష్ణ, పడవల మధుసూదనరావు, మల్లేశ్వరరావు, కొండవీటి శివయ్య పాల్గొన్నారు. కందలంపాడులో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు మొవ్వ నరేష్, మొవ్వ కొండ, బుజ్జి, సామియేలు, కొటయ్య తదితరులు పల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందుతున్న ప్రభుత్వం



ఉయ్యూరులో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వివరిస్తున్న టీడీపీ నాయకులు

ఉయ్యూరు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 100 రోజుల్లో పలుహామీలు అమలు చేసి ఇది మంచి ప్రభుత్వంగా ప్రజల మన్ననలు పొందుతుందని పలువురు టీడీపీ నాయకులు ఈడే అంజిబాబు, చిరంజీవి పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్ర మంలో భాగంగా శుక్రవారం ఉయ్యూరు నగర పంచాయతీ పరిధి వార్డు సచివాలయ సిబ్బందితో కలసి వార్డుల్లో పర్యటించి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ఇంటింటా ప్రచారం చేశారు. పలియాల శ్రీనివాసరావు, బూరెల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాపులపాడు మండల గ్రామాల్లో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : పేదలకు సంక్షేమ పథకాలను సకాలంలో అందించడం ద్వారా ఇది మంచి ప్రభుత్వమని ప్రజలు భావిస్తున్నారని టీడీపీ , జనసేన నాయకులు అన్నారు. కె.సీతారాంపురం, పెరికీడు, కొత్తపల్లి, బండారుగూడెం, ఆరుగొలను తదితర గ్రామాల్లో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. పెరికీడులో వేగిరెడ్డి పాపారావు, బేతాళ ప్రమీలారాణి, ప్రవీణ్, దుర్గాప్రసాద్, రేఖ పాల్గొన్నారు. కె.సీతారాంపురంలో పల్లిపాముల రత్నం, సొదిమెళ్ల రాజశేఖర్, జయరాజు, చెన్నుబోయిన సాంబశివరావు, జగదీష్ పాల్గొన్నారు. బండారుగూడెంలో బేతాళ మాణిక్యాలరావు, కొండేటి నాగరాజు, పాల్గొన్నారు. కొత్తపల్లిలో కోరం రాజు, అక్కినేని రవికుమార్, నాగేశ్వరరావు, మద్దాల దావీదు, జనసేన నాయకులు వడ్డి ఆశోక్, సుదర్శనరాజు, వంకాయల శ్యామ్, తదితరులు పాల్గొన్నారు. ఆరుగొలనులో బేతా శేషుకుమార్, తుమ్మల బ్రహ్మాజీ, అనిల్, వీరం వినయ్, ఆదినారాయణ పాల్గొన్నారు. వేలేరు టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని వేములపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ అవిర్నేని భవానీశంకర్, కాజ సురేష్, అండగాల సీతా రామస్వామి, దోనవల్లి రామారావు పాల్గొన్నారు.



వేలేరులో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో వేములపల్లి శ్రీనివాసరావు

దురుసుగా ప్రవర్తించిన కానిస్టేబుల్ సస్పెన్షన్

ఉంగుటూరు, సెప్టెంబరు 20 : పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న మహిళా కార్మికురాలిపై దురుసుగా ప్రవర్తించిన కానిస్టేబుల్‌పై జిల్లా ఎస్పీ సస్పెన్షన్ వేటు వేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్కూరు పోలీస్‌స్టేషన్లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పఠాన్ నాగులు తన బైక్‌పై గురువారం మధ్యాహ్నం హైవే పక్కన వున్న ఒక పెట్రోల్ బంక్‌లోకి వెళ్లాడు, అక్కడ విధుల్లో వున్న మహిళా హెల్పర్‌ను రూ.220ల పెట్రోల్ కొట్టమని అడిగాడు. పెట్రోల్ కొట్టిన తర్వాత డబ్బులు ఇవ్వకుండా వెనుదిరగడంతో రంగమ్మ డబ్బులు ఇవ్వండని అడిగింది. నన్నే డబ్బులు అడుగుతావా అంటూ కానిస్టేబుల్ నాగులు మహిళా హెల్పర్‌ను బూతులు తిడుతూ ఆమెపట్ల దురుసుగా ప్రవర్తిండంతో పాటు ఆమెపై చేయిచేసుకున్నాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్సై చావా సురేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక విచారణ జరిపిన అనంతరం కానిస్టేబుల్ దురుసుగా ప్రవర్తించనట్టు రుజువు కావడంతో అతనిని సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ గంగాధర రావు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

శ్రీవారి లడ్డూనూ అపవిత్రం చేశారు : రాజా

కంకిపాడు, సెప్టెంబరు 20 : కమీషన్ల కోసం కక్కుర్తి పడి శ్రీవారి లడ్డూనూ సైతం మాజీ సీఎం జగన్మోహనరెడ్డి అపవిత్రం చేశారని టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో అన్ని వ్యవస్థలను జగన్ నిర్వీర్యం చేశారన్నారు. ఇంతటి అపచారానికి పాల్పడిన జగన్‌తో పాటు పాలక మండలి చైర్మన్లు వై.వి. సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి, సంబంధిత అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో స్థానిక టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు, ఏనుగ జయప్రకాష్, కొండా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● అనుమోలు ట్రస్టు సేవలు అభినందనీయమని మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. అనుమోలు ట్రస్టు సహకారంతో ఈడుపుగల్లు గ్రామానికి చెందిన షేక్ మీరాబికి రూ. 5 వేలు శుక్రవారం ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో సలీం, సిద్దయ్య, శ్రీను, మునలయ్య తదితరులు పాల్గొన్నారు.


చేతివృత్తుల వారికి మేలు పీఎం విశ్వకర్మ పథకం



ఉయ్యూరు నేక్ సెంటర్‌లో పీఎం విశ్వకర్మ పథకంపై మాట్లాడుతున్న నగర పంచాయతీ కమిషనర్ వెంకటేశ్వరరావు


ఉయ్యూరు, సెప్టెంబరు 20 : పీఎం విశ్వకర్మ పథకం ద్వారా చేతులు, సాధనాలతో పనిచేసే 18 వ్యాపారాలకు చెందిన చేతివృ త్తులవారు, హస్తకళా కారులకు ఎంతో మేలుకలుగుతుందని ఉయ్యూరు నగరపంచాయతీ కమిషనర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. విశ్వకర్మ పథకం ప్రారంభించి ఏడాదైన సందర్భంగా స్థానిక నేక్ సెంటర్‌లో శుక్రవారం ఆంధ్రనైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొని శిక్షణ పొందుతున్న వారి నుద్దేశించి మాట్లాడారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.శ్రీనివాసరావు, ఆర్ఎస్‌డీఈ డిప్యూటీ డైరెక్టర్ ఎన్‌పీ బన్నిబాగి, ఎన్ఎసీ ఏడీ పవన్‌కుమార్, 350మంది నేక్‌పూర్వ విద్యార్థులు, స్వయం సహాయ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయానికి ప్రజాప్రతినిధుల చిత్రపటాలు



హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 20 : పెరికీడు గ్రామ పంచాయతీ కార్యాలయానికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎంపీ బాలశౌరి చిత్రపటాలను మాజీ ఎంపీటీసీ బేతాళ ప్రమీలారాణి, సింగవరపు దుర్గాప్రసాద్ శుక్రవారం అందజేశారు. నూతనంగా నిర్మించిన సచివాలయంలో ప్రజాప్రతి నిధుల ఫోటోలు లేకపోవడం గమనించి తమ వంతు సహకారంగా పంచాయతీ కార్యదర్శి ఎం. రామకృష్ణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టాపు ప్రవీణ్, కొత్తూరు రేఖ, సురేష్, గిరి, జనసేన వీరమహిళ బండారు ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

డా.కెకెఆర్స్ విద్యార్థికి బంగారు పతకం



గుడివాడ : జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్-2024లో బాలుర వ్యక్తిగత కటా విభాగంలో డా.కెకెఆర్స్ గౌతమ్ విద్యార్థి బి.జశ్వంత్ బంగారు పతకం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సత్యారామ్ తెలిపారు. బి.జశ్వంత్‌ను ఆయన అభినందించారు. జశ్వంత్, కోచ్ వెంకటేశ్వరరావులను పాఠశాల ప్రిన్సిపాల్స్ లక్ష్మీప్రసాద్, జ్యోతి, ప్రశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

హనుమాన్‌జంక్షన్,సెప్టెంబరు 20 : స్థానిక నూజివీడు రైల్వే స్టేషన్ సమీపంలోని ఫ్లైవోవర్ కింద రైలు ఢీకొని పెదపాడు మండలం రామచంద్రపురం గ్రామా నికి చెందిన పసుపురెడ్డి సుజాత(75) మృతి చెందింది. గురువారం ఫ్లైవోవర్ కింద రైలు పట్టాలు దాటుతుండగా విజయవాడ నుంచి ఏలూరు వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొంది. వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. శుక్రవారం మృతదేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఏలూరు రైల్వే పోలీస్‌స్టేషన్ ఎస్సై పి.సైమన్ తెలిపారు.

పట్టిసీమ కాలువలో గుర్తుతెలియని మృతదేహం

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 20 : పట్టిసీమ కాలువలో జంక్షన్ పీఎస్ పరిధిలోని వేలేరు గ్రామం వద్ద గుర్తుతెలియని వ్యక్తి (45) మృతదేహాన్ని శుక్రవారం పోలీసులు గుర్తించారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై జనార్దన్ మృతదేహాన్ని బయటికి తీయించి గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. మృతదేహంపై డ్రాయర్ తప్ప ఎటువంటి ఆధారాలు లేవని ఆచూకి తెలసిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

పాత గొడవలను మనసులో పెట్టుకొని కొయ్యూరులో పలగాని హరీష్‌పై అదే గ్రామానికి చెందిన పలగాని సాయికృష్ణ గురువారం రాత్రి దాడి చేసి గాయపరిచాడు. బాధితుడు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం దీనిపై ఎస్సై జనార్దన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వంట సామగ్రి అందజేత

హనుమాన్‌జంక్షన్,సెప్టెంబరు 20 : ఇటీవల కురిసిన భారీ వర్షాలు, బుడమేరు వరద కారణంగా సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు కమ్మవారి ఐక్యసేవా సమితి, స్థానిక లయన్స్ క్లబ్ సహకారంతో శుక్రవారం వంట సామగ్రిని అందజేశారు. స్థానిక క్లబ్ వద్ద పలువురు బాధితులకు నిర్వాహకులు పంపిణీ చేశారు.సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రామకృష్ణ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కళ్లేపల్లి నారాయణరావు, అట్లూరి రాజశేఖర్, అక్కినేని ఫణి, తదితరులు పాల్గొన్నారు.

నేడు బాపులపాడులో 'ఇది మంచి ప్రభుత్వం'

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 20 : టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకొని 100 సంక్షేమ పథకాలు అమలు చేసిన సందర్భంగా శనివారం బాపులపాడు ఇందిరానగర్ సచివాలయం -2 వద్ద ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వ హిస్తున్నట్లు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు తెలిపారు. సాయంత్రం నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని సభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

హనుమాన్‌జంక్షన్,సెప్టెంబరు 20 : స్థానిక నూజివీడు రైల్వేస్టేషన్ సమీపంలోని పేదల కాలనీలో తాగునీటి సమస్యను పంచాయతీ అధికారులు శుక్రవారం పరిష్కరించారు. 'పేదల కాలనీకి అరకొరగా తాగునీరు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తకు గ్రామ పంచాయతీ స్పందించింది. సర్పంచ్ సరిపల్లి కమలాబాయి పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శి సీహెచ్.ప్రసాద్ బోరు మరమ్మతు చేయించి కాలనీలో తలెత్తిన తాగునీటి సమస్యను పరిష్కరించారు.

స్వచ్ఛతా హి సేవతో గ్రామాల పరిశుభ్రత




కొత్తపల్లి ర్యాలీలో అధికారులు, టీడీపీ నాయకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 20 : మెరుగైన పారిశుధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతతోనే స్వచ్ఛ గ్రామాలుగా రూపొందుతాయని కార్య దర్శి సత్యవతి తెలిపారు. కొత్తపల్లిలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్ర మంలో భాగంగా శుక్రవారం గ్రామవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రజోపయోగ స్థలాల్లో చెత్త వేయరాదని, ఇంటి చుట్టు ప్రక్కల పరిశుభ్రతను పాటిస్తూ సామాజిక ఆరోగ్యం కోసం పంచాయతీ ఏర్పాటు చేసిన చెత్తబుట్టలను ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రామాంజనేయులు, పంచాయతీ సిబ్బం ది, టీడీపీ అధ్యక్షుడు వల్లూరిపల్లి రామకృష్ణప్రసాద్, నాని, కోరం రాజు, అక్కినేని రవికుమార్, కన్నిగంటి నాగేశ్వరరావు, సుధీర్, షేక్ ఇమ్రాన్, భవానీ, మస్తాన్‌వలీ, వడ్డి అశోక్, పల్నాటి సుదర్శన్‌రాజు, శ్యామ్, దావీదు పాల్గొన్నారు.

తల్లిని గౌరవిస్తే భవిష్యత్తు బంగారుమయం

గుణదల, సెప్టెంబరు 20 : తల్లిని గౌరవించే ఆనవాయితీ చిన్ననాటినుంచి అలవర్చుకున్న వారికి భవిష్యత్తు బంగారుమయంగా ఉంటుందని టాటా ట్రస్ట్ అసోసియేట్ కిన్నెర అన్నారు. రామవరప్పాడులోని అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మ కు వందనం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టాటా ట్రస్ట్ అసోసియేట్ కిన్నెర విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తల్లి రుణం తీర్చుకోవడం ఎవరితరం కాదని జన్మనిచ్చిన తల్లిని అగౌరవపర్చకుండా తల్లిని ఆనందపరిచే పనులు చేసేందుకు ప్రయత్నించాలని అప్పుడే కొంత మేరకు రుణం తీర్చుకున్నట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ స్వర్ణకుమారి, రామవరప్పాడు అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



తల్లులకు పాదాభివందనం చేస్తున్న చిన్నారులు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	119, 128, 139
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.50

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించం : డీఎస్పీ

పెడన : శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించే ప్రసక్తే లేదని బందరు డీఎస్పీ అబ్దుల్ సుభానీ హెచ్చరించారు. ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తిన నేపథ్యంలో శుక్రవారం ఆయన పెడన పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామన్నారు. సమస్య పరిష్కారానికి సిట్ ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలో ప్రస్తుతం ప్రశాంత వాతావరణం నెలకొందన్నారు. వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా చెన్నూరులో నెలకొన్న వివాదం సద్దుమణిగిందని చెప్పారు. ఇన్‌చార్జి తహసీల్దార్ పూర్ణచంద్రరావు, సీఐలు ఎన్.వి.ఎస్. మూర్తి, షాహినాబేగం తదితరులు పాల్గొన్నారు.







మాచవరంలో కూటమి ప్రభుత్వ అభివృద్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ | తరకటూరులో మంచి ప్రభుత్వం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ | మచిలీపట్నం 45వ డివిజన్‌లో పి.వి.ఫణికుమార్ తదితరులు

స్వేచ్ఛాయుత పాలనతో ప్రజలకు చేరువ

● ఇది మంచి ప్రభుత్వం గ్రామసభల్లో ఎమ్మెల్యేలు మండలి, కాగిత

అవనిగడ్డ, సెప్టెంబరు 20 : స్వేచ్ఛాయుత పాలన అందిస్తూ మంచి ప్రభుత్వంగా ప్రశంసలు అందుకుంటోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తైన సందర్భంగా శుక్రవారం అవనిగడ్డ పంచాయతీ కార్యాలయంలో ఇది మంచి ప్రభుత్వం గ్రామసభ నిర్వహించారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, యువతకు 16,437 ఉద్యోగాలు, పింఛన్ రూ.4 వేలకు పెంపు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఒకటో తేదీన జీతాలు, రూ.1674.47 కోట్లు బకాయిలు చెల్లింపులు, అన్నా క్యాంటీన్ల పునః ప్రారంభం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, బుడమేరు ముంపు బారిన పడిన విజయవాడ ప్రజలకు చంద్రబాబు స్వయంగా అందించిన సహాయక చర్యలు వంద రోజుల్లో ప్రజలకు చేసిన సేవలన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్రంలోని అన్ని స్థానిక సంస్థలకు, పార్టీలకు అతీతంగా అభివృద్ధి నిధులను మంజూరు చేయటంతోపాటు ఇటీవల వరదల్లో నష్టపోయిన 400 గ్రామ పంచాయతీలకు సొం తంగా రూ.నాలుగు కోట్లు ఇచ్చారన్నారు. డ్వామా పీడీ సూర్యనారాయణ, ఎంపీపీ తుంగల సుమతిదేవి, సర్పంచ్ గోరుముచ్చు ఉమా, ఎంపీడీవో మరియాదేవి, కొల్లూరి వెంకటేశ్వరరావు, కనకదుర్గ, రాయపూడి వేణుగోపాలరావు, బొప్పన భాను, కోడూరు సత్యనారాయణ, పంచాయతీ ఈవో తోట శ్రీనివాసరావు, తుంగల వెంకటగిరి, రామ్మోహనరావు పాల్గొన్నారు. గిలకల దిండిలో టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ ప్రభు త్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, టీడీపీ నగర అధ్యక్షుడు ఎండి ఇలియాస్ పాషా, కార్యదర్శి పిప్పళ్ళ కాంతారావు, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, నోడల్ ఆఫీసర్ సతీష్, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు. **కోడూరు** : మాచవరంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం గ్రామసభలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పాల్గొన్నారు. ముందుగా ఇంటింటికి తిరిగి 100 రోజులలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి కరపత్రాలు అందించి, ప్రజల యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఎంపీడీవో ఆర్.శ్రీనివాస్, ఎంఈవో రామదాసు, శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ అప్పికట్ల లక్ష్మీ, కూటమి నాయకులు బండే శ్రీనివాసరావు, మర్రె గంగయ్య, ఉల్లి శేషగిరిరావు, కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే రాఘవ, కూరాకుల శివయ్య, కూరాకుల ప్రసాద్, రెడ్రౌతు కృష్ణబాబు, నరహరిశెట్టి మాణిక్యాలరావు, కాగిత రామారావు, బచ్చు వెంకటేష్, పూతబోయిన సాయిబాబు, గోగినేని సోమశేఖరరావు, తోట సోమశేఖరరావు, అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు. **మచిలీపట్నం టౌన్** : కానూరు గ్రామం లో తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో వంద రోజుల్లో ప్రభుత్వం చేసిన మంచి పనులు వివరిస్తూ ఇంటింటికీ కరపత్రాలు, స్టిక్కర్లు అందజేశారు. బొమ్మిడి ఏడుకొండలు, సీతారాముడు, చిటికినేటి అయ్యప్ప, దివి మహేష్, గోపు నరేష్, గోపు వెంకటరమణ, బొలిశెట్టి నాని, మోకా వెంకన్న తదితరులు పాల్గొన్నారు. టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి పి.వి. ఫణికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం 45వ డివిజన్‌లో సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికి వంద రోజుల పాలనలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. గంజాల రవికుమార్, కోమటి వెంకటేశ్వరరావు, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, సూరిశెట్టి హరికృష్ణ, షేక్ అల్లాభక్షు పాల్గొన్నారు. **పెడన** : గూడూరు మండలం తరకటూరు గ్రామంలో శుక్రవారం ఇది మన మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో మంచి ప్రభుత్వం అనిపించుకుందన్నారు. పోతన స్వామి, దాసరి ఉమాసాయిరామ్, పంచకర్ల సురేష్, అన్నం హరి, గోపీ నాగబాబు, ఎస్ఏ బేగ్, అర్జా నగేష్, చిన్నం వెంకటరమణ, శలపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **పెడన రూరల్** :. కొంకేపూడి గ్రామంలో ప్రజలకు పంచే కరపత్రాలు తక్కువ వచ్చాయంటూ సచివాలయ ఉద్యోగులు కార్యక్రమం ప్రారంభించక పోవటంతో ఎంపీడీవో రెడ్డయ్య చర్యలు ఉంటాయని హెచ్చరించటంతో ప్రచారం ప్రారంభించారు. ఉరివి, నడుపూరు, నందిగామ, శేరివర్తర్లపల్లి, కాకర్లమూడి, పెనుమల్లి గ్రామాల్లో ఉద్యోగులతో పాటు ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. నందమూరులో మజీ ప్రజాప్రతినిధులకు సమాచారం లేదని పరసా రాంబాబు తెలిపారు. ఈఓఆర్డీ జయరామ, చీర్ల కృష్ణ, పరసా లక్ష్మి, కామేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పెదముత్తేవిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న లింగమనేని



గుడ్లవల్లేరులో ఇంటింటికీ స్టిక్కర్లు అందజేస్తున్న ఎంపీడీవో

ఘంటసాల : అధికారులు, టీడీపీ నేతలు కార్యక్రమానికి సంబంధించిన లోగోలను ఆవిష్కరించారు. ఘంటసాల పాలెంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పంచాయతీ సిబ్బంది వివరించారు. టీడీపీ నాయకులు వేమూరి సాయి వెంకట రమణ, పంచాయతీ కార్యదర్శి బోలెం అర్జునరావు తదితరులు పాల్గొన్నారు. చిట్టూర్పులో సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ గుత్తికొండ రాజ్యలక్ష్మి, టీడీపీ నాయకులు గుత్తికొండ వరప్రసాద్, కార్యదర్శి శ్రీ లక్ష్మీ కృష్ణవేణి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. కొడాలిలో టీడీపీ గ్రామపార్టీ అధ్యక్షులు కంఠమనేని రాజగోపాలరావు, కార్యదర్శి సిహెచ్.వి.ఎస్.నాగమణి తదితరులు పాల్గొన్నారు. **నాగాయలంక** : తలగడదీవి, రేమాలవారిపాలెం సచివాలయాల్లో ప్రతి ఇంటికి 100 రోజుల కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. స్టిక్కర్లు, బ్రోచర్లు అందజేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **కూచిపూడి** : ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన అధికారులు, నేతలు నిర్వహించారు. ప్రభుత్వ పథకాల బ్రోచర్లు, కరపత్రాలు పంపిణీ చేశారు. కూచిపూడి, పెదముత్తేవి, మొవ్వ, కోసూరు తదితర గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో లింగమనేని రామలింగేశ్వరరావు, విజయవర్ధన్, సుధా ప్రవీణ్, ఉప్పలపాటి నాగలక్ష్మి ప్రసన్న, వీరంకి తులసీదాస్, పెనుమూడి రమేష్, దేవినేని రమేష్, తాతినేని పూర్ణచంద్రరావు, శీలం బాబురావు, మండవ కోటేశ్వరరావు, పొట్లూరి బ్రహ్మేశ్వరరావు, ఈడే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు** : గుడ్లవల్లేరు, అంగలూరు గ్రామాల్లో ఎంపీడీవో కృష్ణవేణి ఇంటింటికీ వెళ్లి వంద రోజుల పాలనను ప్రజలకు వివరించారు. గుడ్లవల్లేరు పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, సచివాలయ కార్యదర్శి సుధారాణి, అంగలూరు కార్యదర్శి యెలీషా రావు, పంచాయితీ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు. **తోట్లవల్లూరు** : కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం సాధించిన విజయాలను, సంక్షేమ పథకాలను వివరిస్తు శుక్రవారం నాయకులు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. కనకవల్లిలో ఉప సర్పంచ్, బీసీ సెల్ అధ్యక్షుడు వీరంకి పరశురామ్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు వీరంకి శ్రీనివాసరావు, వీ రంకి గుర్నాధం, మురాల సుబ్రహ్మణ్యం, ధర్మారావు, తోట్లవల్లూరులో గ్రామ టీడీపీ అధ్యక్షుడు గొరిపర్తి గోపయ్య, వల్లూరు రాంబాబు, సచివాలయ సిబ్బంది, చా గంటిపాడులో మట్టా అమృతబాబు తదితరులు ఇంటింటికి తిరిగి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అందిస్తూ సీఎం చంద్రబాబు పాలనను వివరించారు.

గుడివాడ రూరల్ : ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహిస్తున్నట్లు చిరుచింతల ప్రత్యేకాధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు తెలిపారు. పోస్టర్లు ఆవిష్కరించి చిరుచింతల, నూజెళ్ల గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు వాసే మురళీ, మండల వ్యవసాయాధికారి బి.అనంతలక్ష్మి, కార్యదర్శి అనుల, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సత్కారం

గుడ్లవల్లేరు : జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన అంగలూరు డైట్ ఉపాధ్యాయుడు మిద్దె శ్రీనివాసరావును అధ్యాపకులు, చాత్రోపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన ఉపాధ్యాయులు కె.హరికిరణ్, మోహిని కుమారి, పి.టి.జి.ఎస్ ఆచార్యలను డైట్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ నారాయణ సన్మానించారు. లలితా మోహన్, ప్రకాశం ఇతర అధ్యాపకులు,సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణమూర్తికి మండలి సత్కారం



అవనిగడ్డ : మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. జిల్లా మత్స్యకారుల సహకార సంఘం నూతన డైరెక్టరుగా ఎన్నికైన నాగాయలంక మత్స్యకార మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి కృష్ణమూర్తిని శుక్రవారం తన కార్యాలయంలో ఆయన ఘనంగా సత్కరించారు. మత్స్యకారులకు ప్రభుత్వం ద్వారా లభించే సబ్సిడీలు, ప్రోత్సాహకాలు అందించి వారి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కలనం నాగాంజనేయులు, రేవు సువర్ణరాజు, వెంకటేశ్వరరావు, బొడ్డు రామ్మోహనరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

వాసవీ ఇంజనీరింగ్ విద్యార్థులకు అభినందన



పెడన రూరల్ : సిహెచ్ ఫణికుమార్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వేస్ట్ బాటిల్స్ ఉపయోగించి ఓపెన్ ఎయిర్ డయాస్ రూపొందించి అవార్డు అందుకున్న వాసవీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ కాకి కుమార్‌బాబు, డి.బాబా, టి.సాయికుమార్, ప్రిన్సిపల్ బీఆర్ఎస్ రెడ్డి, రాజారమేష్ అభినందించారు.

డా.కెకెఆర్స్ విద్యార్థికి బంగారు పతకం



గుడివాడ : జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్-2024లో బాలుర వ్యక్తిగత కటా విభాగంలో డా.కెకెఆర్స్ గౌతమ్ విద్యార్థి బి.జశ్వంత్ బంగారు పతకం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సత్యారామ్ తెలిపారు. బి.జశ్వంత్‌ను ఆయన అభినందించారు. జశ్వంత్, కోచ్ వెంకటేశ్వరరావులను పాఠశాల ప్రిన్సిపాల్స్ లక్ష్మీప్రసాద్, జ్యోతి, ప్రశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

వరద బాధితులకు వంట సామాగ్రి పంపిణీ

అవనిగడ్డ రూరల్ : వరద బాధితులకు నియోజకవర్గ విద్యా కుటుంబం చేసిన సాయం మోడల్ ప్రాజెక్టుగా నిలుస్తుందని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. దక్షిణ చిరువోలులంకలో నియోజకవర్గ విద్యాకుటుంబం ఆధ్వర్యంలో 460 వరద బాధిత కుటుంబాల వారికి కుక్కర్లు, వంట సామాగ్రి సహాయం అందించే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బి.కనకరావు, జివి.ఎస్.పెరుమాళ్ళు వి.సాంబశివరావు, మేడా బాబ్జీ, కైతేపల్లి దాస్, టివిఎం.రామదాసు, జిఎన్.బి.గోపాల్, అన్నపరెడ్డి పిచ్చియ్య, వి.శ్రీనివాసరావు, నాయకులు నాగ మునేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరం రేపు

గుడివాడ : నందివాడ మండలంలోని పుట్టగుంట, రామాపురం, రుద్రపాక గ్రామాల్లో ఈనెల 22వ తేదీ ఆదివారం మెగా వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పాలడుగు వెంకట్రావు, డాక్టర్ పిన్నమనేని శివరామకృష్ణప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేస్తామని ప్రకటించారు. ఆయా గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

మోటూరు దేవాలయ భూముల కౌలువేలం 30న

గుడివాడ రూరల్ : మోటూరు సీతారామస్వామి దేవాలయానికి చెందిన గుంటూకోడూరు గ్రామంలోని రీ సర్వే నెంబరు.126/2, 3, 4లోని ఐదు ఎకరాల 19 సెంట్ల భూమి కౌలు వేలంపాట ఈనెల 30 తేదీన నిర్వహిస్తామని ఈవో నాగమౌనిక ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాల్సిందిగా కోరారు. వేలంపాట పాడుకున్న వారు మూడు సంవత్సరాల వరకు కొనసాగుతారని ఆమె పేర్కొన్నారు.

మెరైన్ సీఐగా సురేష్ రెడ్డి



కోడూరు : పాలకాయితిప్ప మెరైన్ సీఐగా రావి సురేష్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. విశాఖపట్నం మెరైన్ ఎస్పీ రవి వర్మ ఉత్తర్వుల మేరకు పాలకాయితిప్ప కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ చార్జ్ తీసుకున్నట్లు సీఐ తెలిపారు. మెరైన్ సిబ్బంది నూతన సీఐకి శుభాకాంక్షలు తెలిపారు.

వృద్ధురాలి భౌతికకాయానికి ఆర్‌కె అంత్యక్రియలు

గుడివాడ : సత్యనారాయణపురంలో వృద్ధురాలు కొలగాని ధనలక్ష్మి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందింది. బంధువులకు సమాచారం అందించినా స్పందించకపోవడంతో సామాజికవేత్త మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) ఆమె భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆర్‌కె వెంట ఆర్కే వారియర్స్ శివ, చరణ్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

రెండు ఏసీల బహూకరణ

మచిలీపట్నం టౌన్ : బచ్చుపేట భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానానికి విజయలక్ష్మి ఎంటర్ ప్రైజెస్ అధినేత తూమాటి వెంకట సురేష్‌బాబు శుక్రవారం నాలుగు ఏసీలను బహూకరించారు. దేవస్థానం చైర్మన్ ముత్తేవి రవికాంత్, ధర్మకర్తల మండలి సభ్యులు అన్నంబొట్ల బ్రహ్మానందశాస్త్రి, ఈవో ఎన్.సూర్యచక్రధరరావు పాల్గొన్నారు.

అక్కినేనికి ఘననివాళి



ఏఎన్నార్ కళాశాలలో నివాళులర్పిస్తున్న యాజమాన్యం



కూచిపూడిలో నివాళులర్పిస్తున్న అభిమానులు

అవనిగడ్డ : తెలుగు భాషాభివృద్ధికి అక్కినేని నాగేశ్వరరావు చేసిన కృషి మరువలేదనిదని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. దివిసీమ లలిత కళాసమితి, గాంధీక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో స్వర్గీయ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. అక్కినేని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దివిసీమ లలిత కళాసమితి అధ్యక్షుడు పుప్పాల వీరాంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రముఖ కళాకారుడు బోలెం రామారావు, గాంధీక్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ తుంగల కోటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, రామిశెట్టి వేణుగోపాలరావు, కూనపరెడ్డి చంద్రశేఖర్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్ పంద్రాజు లంకమ్మ ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు. **గుడివాడ** : అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకలను శుక్రవారం విశ్వభారతి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఎఎన్‌ఆర్ చిత్రపటానికి విశ్వభారతి విద్యాసంస్థ చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఎఎన్‌ఆర్ కళాశాలలో అక్కినేని నాగేశ్వరరావు విగ్రహానికి కళాశాల పాలకవర్గ అధ్యక్ష,కార్యదర్శులు ఎల్.ఆర్.కె ప్రసాద్, కె.ఎస్ అప్పారావు నివాళ్ళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.జె.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **కూచిపూడి** : అక్కినేని నాగేశ్వరావు శత జయంతి వేడుకలను కూచిపూడిలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. చలన చిత్రరంగానికి ఆయన చేసిన సేవలు కొనియాడారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. వడ్లాది విష్ణువర్ధన్‌రావు, అయ్యంకి ఆనందరావు, మురారి ప్రభాకర్‌రావు, అక్కినేని అభిమానులు పాల్గొన్నారు.



వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు సూచనలు

ఘంటసాల : వరి పంటలో సస్యరక్షణ చర్యలపై యండకుదురు రైతు సేవా కేంద్రంలో రైతులకు డీడీఏ జ్యోతిర్మయి అవగాహన కల్పించారు. వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా క్లోరాంత్రనిల్‌ప్రోల్ 0.3 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి మొక్క మొత్తం తడిచేలా పిచికారి చేయాలన్నారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రేవతి మాట్లాడుతూ పగటి ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల, కె.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి కె.మురళీ కృష్ణ, వ్యవసా య అధికారిణి బి.పద్మజ, వీఏఏ వి.నాగబాబు, రైతులు పాల్గొన్నారు.

బురద, చెత్తాచెదారం తొలగించాలి

ఘంటసాల : పంట భూముల్లో పేరుకుపోయిన బురద, చెత్తా చెదారం తొలించాలని కోరు తూ వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్రబాబు, సొసైటీ సభ్యులు తహసీల్దార్ బి.విజయప్రసాద్, డీటీ చప్పిడి చిట్టిబాబులకు వినతిపత్రాలు అందజేశారు. పాపవినాశనం ఆది ఆంధ్ర ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ (ఎస్సీ) కమిటీ సభ్యులు ఆర్.నెంబర్ 176లో సుమారు 490 మంది రైతులు సాగుచేసుకుంటున్నారన్నారు. అధ్యక్షుడు జుజ్జువరపు చంటి, కార్యదర్శి వీరరాఘవులు, కె.రామయ్య, ఎం.అప్పారావు, బుర్రె విశ్వేశ్వరరావు, కె.ధర్మారావు, గూడవల్లి ఏడుకొండలు, కుంపటి కోటేసు, కొడాలి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడి లడ్డూ రూ.46 వేలు

నాగాయలంక : భావదేవరపల్లి రామాలయంలో వినాయకుడి లడ్డూ ప్రసాదాన్ని గ్రామానికి చెందిన కూనపరెడ్డి అంకాలరావు రూ.46 వేలకు దక్కించుకున్నారు. ఆవుల ముమ్మారెడ్డి యువత ఆధ్వర్యంలో నవరాత్రి మహోత్సవాలు జరిగాయి.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

అవనిగడ్డ : ర్యాగింగ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని సీఐ జి.యువకుమార్ సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ ఎ.వీరకుమారి ఆధ్వర్యంలో ర్యాగింగ్ అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలన్నారు. ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్, డ్రగ్స్, ఆన్‌లైన్ యాప్ మోసాల బారిన పడకుండా మంచిగా చదువుకుని ఉన్నత్తులుగా ఎదగాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.అంకారావు, అధ్యాపకులు డా.డి.రాజ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యావసర కిట్లు పంపిణీ

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 26 మంది పాములలంక విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు శుక్రవారం బియ్యం, నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. ఎంఈవో సురేష్, మనోహర్‌కుమార్, లెనిన్‌బాబు, మైథిలి, విజయశ్రీ, అబ్దుల్ హబీబ్, సీహెచ్ శ్రీధర్, పి.వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

మచిలీపట్నం టౌన్ : జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని అన్ని విభాగాల్లోనూ రోగులకు సేవలు అందించాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం కోరారు. జిల్లా ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రసాద్‌కు సుబ్రహ్మణ్యం శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. దంత వైద్య సేవలు అందుబాటులో లేవన్నారు. గైనిక్‌వార్డులో ఏసీలు, ఫ్యాన్ సౌకర్యం కల్పించాలన్నారు. జోగి శివ, ధనికొండ శ్రీను, పడమట గోపీ, ఎం. గోపి, రాము, పవన్ పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు, యునిఫాం పంపిణీ


తోట్లవల్లూరు : కృష్ణానది వరద ప్రభావిత గ్రామాల్లో విద్యార్థులకు శుక్రవారం పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్, బెల్టులను, బ్యాగ్‌లను ఎంఈవో సురేష్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. పాములలంక, తోడేళ్ళదిబ్బలంక, కాళింగదిబ్బలంక, పిల్లివానిలంక, పొట్టిదిబ్బలంక, కనిగిరిలంక, ములకలపల్లిలంక, తుమ్మలపచ్చికలంక గ్రామాలకు పుస్తకాలు సరఫరా చేసిందని ఎంఈవో సురేష్ తెలిపారు.



సామూహిక సీమంతం

మచిలీపట్నం టౌన్ : గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ పీడీ సువర్ణ అన్నారు. బందరు మండలం పోతేపల్లి గ్రామంలో శుక్రవారం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పౌష్టికాహార స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. సీడీపీవో గ్లోరి, సూపర్‌వైజర్లు లక్ష్మీకుమారి, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలే ఎస్‌బీఐ లక్ష్యం



మచిలీపట్నం టౌన్ : ఖాతాదారులు మెరుగైన సేవలందించడమే ఎస్‌బీఐ లక్ష్యమని ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ జనరల్ మేనేజర్ శైలేష్‌కుమార్ అన్నారు. మచిలీపట్నం శాఖను శైలేష్‌కుమార్ సందర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రికి రెండు, ఆంధ్రా ఆసుపత్రికి ఒక వీల్‌చైర్ అందజేశారు. ఎస్‌బీఐ ఖాతాదారులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మలయ్యప్పన్‌పేట పాఠశాల భవనం ప్రారంభం

పామర్రు : మలయప్పన్‌పేట పాఠశాల నూతన భవనాన్ని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే కుమార్ రాజా శుక్రవారం ప్రారంభించారు. ఎంపీడీవో రామకృష్ణ, వైస్ ఎంపీపీ రమాదేవి, ఎంపీటీసీ సభ్యురాలు రత్నకుమారి, ఎంఈవో పద్మావాణి, ప్రవీణ్‌చంద్ర, గణేష్, చాట్ల రమేష్, మంతెన రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.